క్లుప్తంగా

ఫైలేరియాపై అవగాహన



మంగళగిరి: మంగళగిరిలోని గణపతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఫైలేరియాపై రోగులకు అవగాహన కల్పించారు. ఫైలేరియా వ్యాధికి గురైన అవయాన్ని శుభ్రపరచుకునేందుకు ఉచితంగా వస్తువులు, మందులు పంపిణీ చేశారు. గుంటూరు సహాయ మలేరియా అధికారి రాజు పాల్గొని, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోగులు వ్యాధికి గురయిన అవయాలను ఎలా సంరక్షించుకోవాలి, శుభ్రపరచుకోవాలని అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, ఎయిమ్స్ డాక్టర్లు భరత్, సింహిత్, మలేరియా యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్ వైజర్లు సైదులు, సాగర్ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్ : పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్తి పన్ను బకాయిదారులు ప్రస్తుత సంవత్సరం చెల్లించాల్సిన మొత్తంతో పాటు పాత బకాయిలపై వడ్డీని 50 శాతం మేర మాఫీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మార్చి 31వ తేదీలోగా చెల్లించే బకాయిలకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంటీఎంసీ పరిధిలోని పన్నులు చెల్లించాల్సిన వారు వినియోగించుకుని వారి ఆస్తి, ఖాళీ స్థలాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అభయాంజనేయ స్వామికి పూజలు



దుగ్గిరాల: మండలంలోని ఈమని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి నెలా ఆఖరి మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.శివ, పి.కృష్ణ, జి.శ్రీను, గ్రామ పెద్దలు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు రుణ అర్హత మేళా

మేడికొండూరు: మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న బీసీ కార్పొరేషన్ రుణ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పాడిబండ్ల పూర్ణ శంకరరావు మంగళవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ తోపాటు కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, కాపు, మేదర, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్లకు సంబంధించి రుణ మేళా క్రెడిట్ క్యాంపు ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు ప్రింట్ కాపీ, ఆధార్, రేషన్, క్యాస్ట్ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని తెలిపారు.

30న గుర్రం జాషువా పురస్కారాలు



దుగ్గిరాల: పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా పురస్కారాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దుగ్గిరాలలోని జాషువా విగ్రహం దగ్గర మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. కళాపరిషత్ వారు 37వ వారికోత్సవం, ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 30న పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న జాషువా పద్య పఠనం, జాతీయస్థాయి ఉగాది సమ్మేళనం, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కవులు, కళాభిమానులు, వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.యెహోను, షేక్.సుభాని, రాజేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పరిశీలన

మంగళగిరి: మంగళగిరి రూరల్ ఏరియాలలోని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట ఆయా కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సీహెచ్ వెంకట్, బాలూనాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే 'నేస్తం' కావాలి

- వేసవిలో గుంత మగ్గంతో నేయడం కష్టం
- ఎండలకు మగ్గిపోతున్న వృద్ధ చేనేతలు
- గత ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం'తో ఆర్థిక సాయం
- ఎండలకు విశ్రాంతి తీసుకునే వెసులుబాటు
- కూటమి ప్రభుత్వ 'నేస్తం' కావాలంటున్న కార్మికులు

మంగళగిరి: మండు వేసవిలో నేతన్న ఎండకు తట్టుకోలేక మగ్గిపోతున్నాడు. కుటుంబ పోషణకు వేరే దారి లేక ఎండను సైతం లెక్కచేయకుండా.. గుంతలో నేత వృత్తిని కొనసాగిస్తున్నాడు. శీతాకాలం, వర్షాలకు సాధారణ వాతావరణంలో నేత నేయడం చేనేత కార్మికులకు సులభంగానే ఉంటుంది. కానీ, వేసవిలో గుంత మగ్గంలో నేయడం అంటే కష్టంతో కూడుకున్న పనే. సగం మనిషి గుంతలో ఉండి, ఎండకు చెమటలు కక్కుతూ పనిచేయాలి. జిల్లాలో 1,700 కు పైగా గుంత మగ్గాలున్నాయి. గుంత మగ్గంలో నేసే కార్మికులకు 50 సంవత్సారాలకే నడము నొప్పులు రావడంతో ఇక పని చేయలేరు.

చేనేత కష్టాన్ని గుర్తించిన గత ప్రభుత్వం

చేనేత కార్మికుల కష్టాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. వారికోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ పథకం కింద నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. దీంతో వేసవిలో పనిచేయలేని చేనేతలకు కొంత ఉపశమనం లభించినట్టైంది. కొన్ని రోజులు సెలవు తీసుకునే వెసులుబాటు కలిగింది.



గుంత మగ్గంలో నేస్తున్న నేతన్న



గుంత మగ్గంలో నేస్తున్న నేత కార్మికురాలు

కూటమి ప్రభుత్వం కట్..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నేతన్న నేస్తం పథకాన్ని రద్దు చేసింది. రోజంతా పని చేసి రూ.300 నుంచి రూ.400 సంపాదిస్తేనే కానీ, ఇళ్ల గడవని పరిస్థితి చేనేత కార్మికులది. ప్రస్తుతం ఎండలకు ఉదయం, సాయంత్రం మాత్రమే పని చేస్తుండడంతో కార్మికులకు రూ.200 నుంచి రూ.250 లోపే ఆదాయం వస్తుంది. దీంతో ఇళ్ల గడవడం సైతం కార్మికులకు కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అందజేసిన విధంగానే నేతన్న నేస్తం అమలు చేసి, కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు. రానున్న రోజులలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం స్పందించాలంటున్నారు.

గుంత మగ్గంలో నేసే ఓపిక లేదు

సాధారణ రోజుల్లోనే మలాంటి వృద్ధులు రోజంతా నేత నేయలేరు. రోజుకు రూ.300 నుంచి రూ.400 కూలి గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం ఎండలకు గుంతలో కూర్చునే శక్తి లేదు. దీంతో రెండుమూడు గంటలు పని చేయలేకపోతున్నాం. రూ.200 కూలి కూడా రావడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం అందించడంతో ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉండేది.

– కాగిత భాస్కరరావు,
చేనేత కార్మికుడు, మంగళగిరి.

ఎండలకు నేత కష్టమే

గుంత మగ్గాల్లో నేత నేసే మాలాంటి కార్మికులు సాధారణ రోజుల్లో మాదిరిగా.. రోజంతా ఎండాకాలం నేయలేరు. దీంతో ఆదాయం పడిపోతుంది. పైగా ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం చల్లబడిన సమయంలో మాత్రమే నేత నేయాల్సి వస్తుంది. దీంతో రోజుకి రూ.400 సంపాదించుకునే కార్మికులు నేడు రూ.200లు కూడా సంపాదించలేకపోతున్నారు.

– ఉద్దంగి అనసూయ్య,
చేనేత కార్మికురాలు, మంగళగిరి.

సౌందర్య మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

తాడేపల్లి రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఇటీవల మృతి చెందిన సౌందర్య మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె కుక్కమళ్ల సౌందర్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ప్రేమించి పెళ్లిచేసుకున్న సౌందర్య భర్త రాజు దుర్మార్గంగా సౌందర్యను హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించారని స్థానిక మహిళలు, గ్రామస్తులు చెప్పడం బాధాకరమైన విషయమని అన్నారు. సౌందర్య మృతికి భర్త రాజుతో పాటు మామ పాత్ర కూడా ఉండబట్టే ఈ దారుణం చోటుచేసుకుందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఐద్వా తాడేపల్లి పట్టణ కార్యదర్శి పి. గిరిజ, తాడేపల్లి మండల కార్యదర్శి కొండపల్లి యశోద, ఎస్. శివపార్వతి, కె. శ్యామల తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రల విధి.. గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం

జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్

లాం(తాడికొండ): గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా క్లాప్ మిత్రల పనితీరు ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ అన్నారు. ఈ నెల 20 నుంచి తాడికొండ మండలం లాం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న క్లాప్ మిత్రల శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు జరిగిన పెదకాకాని మండల మిత్రల సమావేశంలో ముఖ్య అతిథిగా డీపీఓ పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తడిచెత్త, పొడిచెత్త సేకరించడం ద్వారా సంపద తయారీ చేసి పంచాయతీలకు ఆదాయం కల్పించేలా మిత్రలు పనిచేయాలన్నారు. అందుకు అవసరమైన నైపుణ్యాలను శిక్షణ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేస్తే సంపూర్ణ పారిశుద్ధ్యంతో పాటు ఆదాయ కేంద్రాలుగా సంపద తయారీ కేంద్రాలను మార్చవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సమతావాణి, ఈవోపీఆర్డీ కె.సాయిలీల, డీపీఆర్సీ అధికారి ఎస్.నిరంజన్, కార్యదర్శి అరుణ్‌కుమార్, పలువురు సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి



మంగళగిరి టౌన్: ప్రముఖ క్రైస్తవ ఇవాంజలిస్ట్, ప్రబోధకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని మంగళగిరి నియోజకవర్గ క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళగిరి నగర పరిధిలోని కమిటీ ఆధ్వర్యంలో క్రైస్తవులు గౌతమ బుద్ధ రోడ్డు వద్ద నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. మంగళగిరి పట్టణ పోలీసులకు, తహసీల్దార్ కార్యాలయంలో ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి రాష్ట్రంలో సంచలనం కలిగించిందని అన్నారు. రాజమండ్రి సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తూ అనుమానాస్పద స్థితిలో రోడ్డుపక్కనే మరణించి ఉండడం, దేహం పడి వున్న పరిస్థితి, ముఖంపై గాయాలు ప్రమాదంలా అనిపించడం లేదని అనుమానం వ్యక్తం చేశారు.

సీఆర్డీఏ అధికారులను కలిసిన ఉండవల్లి రైతులు



తాడేపల్లి రూరల్: కొండవీటి వాగు వెడల్పు నిమిత్తం నష్టపోయిన రైతులు మంగళవారం సీఆర్డీఏ కార్యాలయంలో డెప్యూటీ కలెక్టర్‌ను కలిశారు. కొండవీటి వాగు వెడల్పు నిమిత్తం నష్టపోయిన రైతులు, ఇంటి యజమానులకు నష్టపరిహారం ఏమి ఇస్తారని అధికారులను అడిగారు. వాగు మొత్తం 175 మీటర్ల వెడల్పు చేస్తారని, అయితే ఇంకా ఫైనల్ కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2017లో ఉండవల్లి పొలాల రిజిస్ట్రేషన్ వాల్యూ ఎకరానికి రూ.25 లక్షలు ఉందని, ఇతర గ్రామాల్లో రూ.3 నుంచి రూ.5 లక్షలు మాత్రమే ఉందన్నారు. ఉండవల్లి రైతులకు న్యాయమైన ప్యాకేజీ ఇవ్వాలని అధికారులకు విన్నవించారు. స్పందించిన డిప్యూటీ కలెక్టర్ సీఆర్డీఏ కమిషనర్‌కు, సంబంధిత మంత్రి వద్దకు విషయాన్ని తీసుకువెళతామని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత వరకు ఘర్షణ వాతావరణం లేకుండా చూడాలని జిల్లా రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘ బాధ్యులు వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు రవి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ షహేలా నర్గీస్, జెడ్పీటీసీ కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో అధికారులు తమ శాఖల అభివృద్ధి అంశాలు తెలియజేశారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థలం ఉండి కొత్తగా ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులు ఈ నెల 30 లోగా తమ దరఖాస్తులు కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మించుకొని, వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిపోయిన వారు మళ్లీ ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం అసిస్టెంట్స్ ఫైనాన్స్ పేరిట కేటాయించినట్లు తెలిపారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఎంజేఏవై(ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన) ద్వారా ప్రతి 70 ఏళ్ల దాటినవారి ఆరోగ్య స్థితిగతులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్డు కేటాయిస్తారని దానికి రూ.5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

తాడేపల్లిలోనే మురుగు సమస్య అధికం

మాజీ ఎంపీ మధు



అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో ఎక్కడా లేని మురుగు సమస్య తాడేపల్లి పట్టణంలో కనిపిస్తోందని మాజీ ఎంపీ పి.మధు వ్యాఖ్యానించారు. మంగళవారం తాడేపల్లి బైపాస్‌రోడ్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి బకింగ్‌హామ్ కెనాల్ వరకు ఉన్న పలు అపార్ట్‌మెంట్ వాసులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మురుగు కాల్వలు మొత్తం 60 అడుగుల దూరంలో ఒకేచోట చెత్త వెలికి తీయడానికి ఖాళీ ఉంచారని అగ్రహం వ్యక్తం చేశారు. కాలువ మధ్యలో పెద్ద ఎత్తును చెత్త పేరుకుపోయి మురుగు బయటకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో రోడ్ల మీదకు, నివాసాలలోకి వస్తున్నాయని అన్నారు. మురుగుతో కలసి మంచినీళ్ల ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. క్రిస్టియన్ పేట చర్చి సమీపంలో ఉన్న కనకదుర్గ దేవాలయానికి సంబంధించిన భూమిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరారు. తాడేపల్లి, విలీన గ్రామాల్లో ఉన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న మంగళగిరి కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేయనున్నామని తెలిపారు. జొన్నవిత్తుల శేషయ్య, వై.నేతాజీ, బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, దొంతిరెడ్డి శ్రీనివాస్‌కుమారి, కొట్టే కరుణాకర్, వేముల దుర్గారావు, బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

చిర్రావూరు గ్రామంలో రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని మాజీ ఎంపీ పి. మధు డిమాండ్‌చేశారు. మంగళవారం సాయంత్రం చిర్రావూరు గ్రామంలో రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న మురుగనీటి సమస్యపై వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మండల విలీన గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని అన్నారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువ వ్యర్థాలతో మురుగునీటితో నిండిపోవడం వల్ల పంట కాలువ క్రింద సాగు అయ్యే పొలాలు అన్నీ చౌడు భూములుగా మారే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వై.నేతాజీ, జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, బూరుగ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి



ఇంటర్ బోర్డు సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మంగళగిరి: వేసవి సెలవుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జూనియర్ కళాశాలలు బ్రిడ్జి కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తున్నాయని, ఆ కళాశాలల యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో బోర్డు కార్యదర్శి భారతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలి సంవత్సరం పరీక్షలు ముగిసి పది రోజులు కాకముందే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కోర్సు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చైతన్య, నారాయణ, భాష్యం వంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్నిసార్లు కోరినా అలాంటి అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పేరుతో రూ.లక్షల ఫీజులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, ఉమాకాంత్, లీలా కృష్ణ, అఖి, నాని పాల్గొన్నారు.

సచివాలయానికి విద్యుత్ బంద్



మండలంలోని పేరేచర్ల గ్రామ సచివాలయం-3 భవనానికి విద్యుత్ సరఫరాను విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం నిలిపివేశారు. విద్యుత్ మీటర్ లేకుండా విద్యుత్తు వినియోగించుకుంటూ.. బిల్లులు కట్టడం లేదని విద్యుత్ వైర్‌ను తొలగించారు. దీంతో సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. సేవల కోసం వచ్చిన గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

– మేడికొండూరు

రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి



చర్చావేదికలో మాట్లాడుతున్న మన్నూరు భాస్కరయ్య

తాడేపల్లి రూరల్ : ఏప్రిల్ 20, 21 తేదీల్లో కొండవల్లిలో నిర్వహించతలపెట్టిన ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లిలో ఏర్పాటు చేసిన చర్చా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ద్వారా బడ్జెట్‌లో కేటాయించిన నిధులను రజకుల అభివృద్ధికి ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు బీసీ తరగతులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని, 50 సంవత్సరాలు వయసు నిండిన రజకులకు పెన్షన్ అందజేస్తామని, ఆదరణ పథకం 2 ద్వారా వృత్తిపరికరాలు అందిస్తామని వాగ్దానాలు చేశారని గుర్తుచేశారు. ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఏపీ రజక ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల రాము, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ భారీ బహిరంగ సభలో రజక సోదరులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాగోలు శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు తుమ్మపూడి శివయ్య, ఉండవల్లి పార్థసారథి, మస్తాన్‌రావు, ధరణికోట వీరాంజనేయులు, తాడేపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

28న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అదాలత్ ప్రారంభమవుతుందని చెప్పారు. పోస్టల్ సేవల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను ఈ నెల 27వ తేదీ లోపు ఉత్తరం ద్వారా డాక్ అదాలత్, పోస్ట్ ఆఫీస్ సూపరిండెంటెండ్, తెనాలి డివిజన్, తెనాలి-522201 అనే చిరునామాకు పంపాలని సూచించారు.

CHANGE OF NAME

I, SHAIK USMAN S/o ISMAIL, 39 years Resident of D.No: 7-44, Islampet, Mangalagiri, Guntur Dt., A.P. My Daughters Date of Birth Certificate her Name was Wrongly Mentioned As SHAIK SEHAR (Old Name) Insted of SHAIK SAIRA AZRIN (New Name) Vide Affidavit dated 25/03/2025 Before Mangalagiri.

మరోసారి వాయిదాపడ్డ వేలం



తెనాలిఅర్బన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలోని కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం, చినరావూరు పార్కులోని ఫుడ్‌కోర్టు, వాహనాల పార్కింగ్, క్యాంటిన్, ముత్తెంశెట్టిపాలెంలోని కబేళాకు మంగళవారం మున్సిపల్ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. గతం కంటే తక్కువగా పలువురు వ్యాపారులు పాడటంతో పలువురు అధికారులు పాటలన్నింటినీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనల ప్రకారం గతంకంటే ఎక్కువ పాటలు వస్తేనే వాటిని అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27న మరోసారి వీటికి వేలంపాటలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, ఆర్వో రాంప్రసాద్, పలువురు రెవెన్యూ ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నిడమర్రు రైల్వే ఫ్లైఓవర్‌కు మోక్షం



నిడమర్రు రైల్వే గేటు

మంగళగిరి: మంగళగిరి నుంచి రాజధాని అమరావతి, తాడికొండ, అమరావతి వెళ్లే వారికి ప్రధాన రహదారి నిడమర్రు రోడ్డులో రైల్వే గేటు వంతెన నిర్మించాలనే డిమాండ్ ఉంది. అమరావతి రాజధానిగా ప్రకటించిన అనంతరం రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కృషితో రైల్వే వంతెన రూ.92 కోట్లతో నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. నిర్మాణాన్ని శ్రీకారం చేయాలనుకుంటున్న తరుణంలో 2024 ఎన్నికలు రావడంతో ఆలస్యం అయింది. ఎట్టకేలకు మరలా కేంద్రప్రభుత్వం రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.128.18 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు వరుసల వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇటీవల మట్టి నమూనాలు సేకరించిన అధికారులు, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.